క్లుప్తంగా

ప్రతి నెల నమోదు చేయాలి



మానవపాడు: ప్రతి నెల యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సీడీపీఓ సుజాత తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో మానవపాడు ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోషణపక్షం ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్లు బీరెల్లి, పూడురు, వీరాపురం పరిధిలోని 11కేవీ ఫీడర్ల మరమ్మతు పనులు, విద్యుత్ సామగ్రి మార్పుట, చెట్లను తొలగించనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అలంపూర్: 33 కేవీ శాంతినగర్–1 ఫీడర్ నుంచి 33/11 పెద్ద పీటీపాడు సబ్ స్టేషన్‌కు వెళ్లే 33కేవీ క్రాసింగ్ పరిధిలోని శివాలయం, ఆర్డీఎస్ కాల్వ సమీపంలో, గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవే వారి విద్యుత్ లైన్‌ల మరమ్మతు చేపడుతున్నట్లు ఏడీఈ మహమ్మద్ చిన్న మక్బుల్ బాష పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు పీటీపాడు, ముండ్లదిన్నె, తుమ్మిళ్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. అయిజ మండలంలోని 33/11 కేవీ వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెంకటాపురం ఫీడర్, 33/11కేవీ శాంతినగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొంకల ఫీడర్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ నియంత్రికలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాజోళి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ తెలిపారు. మండలంలోని తుమ్మిళ్ల, పెద్ద తాండ్రపాడు, ముండ్లదిన్నెలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10:30కు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అధికారులు పూర్తి స్థాయి నివేదికలను ముందుగా సమర్పించి, సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేల ఎల్‌ఓసీని మున్సిపాలిటిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన పరదేశ్ ఆపరేషన్ కోసం అందజేశారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, నాగేశ్వర్ రెడ్డి, రఘు రెడ్డి, మైపాల్ రెడ్డి, సూర్యుడు తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

గద్వాల అర్బన్: మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, నల్లారెడ్డి మాట్లాడారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో రవి, రఘు, దామోదార్, నాగరాజు, వెంకటేష్, తిరుపతయ్య, తిమ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ బారికేడ్లు వితరణ

గద్వాల క్రైం: పోలీసుశాఖకు 20 ట్రాఫిక్ బారికేడ్లను ఓ వస్త్ర దుకాణ వ్యాపారి వితరణ చేసినట్లు ఎస్పీ సృజన శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మానవపాడు: మండలంలోని చెన్నిపాడుకు చెందిన అశోక్ అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శుక్రవారం మండల కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సిరాజ్ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వల్లూరు చెందిన బోయ ఎర్రన్న అనారోగ్యంతో మృతి చెందగా, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసులు శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వేణుగోపాల్ నాయుడు, గ్రామ పెద్దలు ఉన్నారు.

రోడ్డు వేసి.. డ్రెయిన్లు మరిచారు

- అలంపూర్ నియోజకవర్గంలో రూ.7.81 కోట్లతో సీసీ రోడ్లు
- డ్రెయినేజీలు లేకుండా 172 చోట్ల రోడ్లు నిర్మిస్తున్న వైనం
- రోడ్లపై మురుగు నిలిస్తే నడవలేని దుస్థితి



జూలెకల్‌లో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు



రామాపురంలో డ్రెయినేజీలు వేసిన సీసీ రోడ్డు

శాంతినగర్: అంతర్గత రోడ్లకు సీసీ వేశారని సంతోషపడాలో, రోడ్లపై మురుగునిలవడంతో బాధపడాలో తెలియని పరిస్థితి నియోజకవర్గంలో నెలకొంది. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గతంలో సీసీ రోడ్లు వేశారు. ఇరువైపుల డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే వృథానీరు, వర్షం నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి సీసీ రోడ్ల పనులు చేపట్టారు. ఒక్కో గ్రామంలో రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల నిధులు కేటాయించారు. గతంలో వేసిన రోడ్లపై నీరు నిలుస్తున్నాయని రోడ్లు వేస్తే మరీ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని, డ్రెయినేజీలతో రోడ్లు నిర్మించాలని కాంట్రాక్టర్లను ప్రజలు కోరుతున్నారు. సీసీ రోడ్ల వెంట డ్రెయినేజీలు మంజూరుకాలేదు.. మేమేమి చేసేది అంటూ కాంట్రాక్టర్లు వారి పనులు చేసుకుంటూ పోతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్‌శాఖ అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు.

మట్టి రోడ్లు నీరు మింగేవి

గతంలో ఉన్న మట్టి రోడ్లు కొంత వరకైనా మురుగు ఇంకిపోయేదని, ప్రస్తుతం వేసిన సీసీ రోడ్లపై నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్లు మంజూరు ఇలా

నియోజకవర్గంలో అయిజ మండలంలో 29 పనులకు రూ.1.35 కోట్లు, వడ్డేపల్లి 22 పనులకు రూ కోటి, రాజోళి మండలంలో 27 పనులకు రూ.1.27 కోట్లు, మానవపాడు 20 పనులకు రూ.91 లక్షలు, ఇటిక్యాల మండలంలో 33 పనులకు రూ.1.50 కోట్లు, ఉండవెల్లి 21 పనులకు రూ.92 లక్షలు, అలంపూర్ మండలంలో 20 పనులకు సంబంధించి రూ.88 లక్షలు మొత్తం 172 పనులకు రూ.7.81 కోట్లు మంజూరయ్యాయి.

ఒక్క పైసా మంజూరు కాని వైనం

నియోజకవర్గంలో 172 పనులు చేపట్టగా ఒక్క చోట కూడా డ్రెయినేజీలకు పైసా మంజూరు చేయలేదు. దీంతో గతంలో రోడ్లపై మురుగు నిల్వ ఉండే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆయా మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యం అవుతుందని..

సీసీ రోడ్లతోపాటు డ్రెయినేజీలు మంజూరు చేస్తే పనులు ఆలస్యమవుతాయని, త్వరితగతిన పనులు పూర్తి కావాలంటే కేవలం సీసీ రోడ్లు మాత్రమే సాధ్యపడుతుందని చెప్పడంతో సీసీ రోడ్లకు అనుమతులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు మార్చి నెలలో మంజూరు చేయడం నెలాఖరులోపు పనులు పూర్తిచేయాలని లేని పక్షంలో బిల్లులు రావని చెప్పడంతో కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు మాత్రమే వేస్తామని చెబుతున్నారని సమాచారం.

మురుగు నిలుస్తుంది



గతేడాది మా కాలనీలో సీసీ రోడ్డు వేశారు. ఇరువైపుల డ్రెయినేజీ నిర్మించలేదు. ఇళ్ల నుంచి వస్తున్న మురుగు రోడ్డుపై నిలిస్తోంది. కాల్వ లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడ నిలిచి కంపు కొడుతోంది. ఇరువైపుల డ్రెయినేజీ కాల్వ నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– వెంకటేష్‌యాదవ్, జూలెకల్, వడ్డేపల్లి మండలం

కాల్వలు ఏర్పాటు చేయాలి



గ్రామంలో ఇటీవల సీసీ రోడ్లు వేశారు. ఒక్క చోట కూడా కాల్వలు నిర్మించలేదు. గతేడాది రోడ్లు వేసే సమయంలో కాల్వలు నిర్మిస్తే బాగుంటుందని అధికారులను కోరాం. పైనుంచి కాల్వలు మంజూరు కాలేదని చెప్పారు. ఈ ఏడాదైనా సీసీ రోడ్ల వెంట కాల్వలు నిర్మిస్తారని ఎదురుచూశాం. కేవలం రోడ్లు వేసి వదిలేస్తున్నారు. ఇలాగైతే గ్రామాలు పరిశుభ్రంగా ఎలా మారతాయో మంజూరుచేసిన వారికే తెలియాలి.

– మహేశ్వర్‌రెడ్డి, తనగల, వడ్డేపల్లి మండలం

డ్రెయినేజీలు మంజూరు కాలేదు

డివిజన్‌లో ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రూ.కోట్లతో సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో చాలా వరకు రోడ్ల పనులు పూర్తయ్యాయి. ఇరువైపుల డ్రెయినేజీలు మంజూరు కాలేదు.

– అంజనేయులు, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

రేపు ఓటరు దరఖాస్తుల స్వీకరణ



గట్టులో మాట్లాడుతున్న తహసీల్దార్ సరితారాణి

గట్టు: ఓటర్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం ఆదివారం బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండనున్నట్లు తహసీల్దార్ సరితా రాణి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరితారాణి మాట్లాడుతూ కొత్తగా ఓటర్ నమోదు, చిరునామా మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అందురూ బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, గిర్దావర్ రాజు, గణాంక అధికారి శ్రీనివాసులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మల్దకల్: గ్రామాలలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలని తహసీల్దార్ జుబేర్ మోహినుద్దీన్ బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాలులో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటు నమోదు చేసే ముందు వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో పేరు ఉండి చనిపోయినట్లయితే వారి కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకుని తొలగించాలన్నారు. కొత్తగా వివాహమైన వారి పేర్లు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నాగిరెడ్డి, మద్దిలేటి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

‘గాలికుంటు’ సోకకుండా టీకాలు



గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

అయిజ: గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను పశువులకు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి కోరారు. శుక్రవారం మండలంలోని ఉప్పలలో 374 పశువులకు వ్యాక్సిన్ వేశారు. పశువులకు వ్యాక్సిన్ వేయించాలనుకునే వారు పశువైద్యశాలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలియజేయాలని సూచించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో వర్షాకాలంలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శుక్రవారం వేశారు. ముందస్తు టీకాల పంపిణీలో భాగంగా 26 మంది రైతులకు చెందిన 226 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అంతంపల్లిలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

గట్టు: మండల పరిధిలోని అంతంపల్లి మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో చక్కగా విద్యాబోధన చేసి ఆకట్టుకున్నారు.

ఎగిసిపడిన మిషన్‌భగీరథ నీరు



ఉండవెల్లిలో ఎగిసిపడుతున్న నీరు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి పైపు కనెక్టింగ్ వద్ద ఎయిర్ లాక్ చేయడంతో నీరు ఎగిసిపడ్డాయి. శుక్రవారం మిషన్ భగీరథ నీరు వచ్చే లైన్‌లో పైపు లీక్ కావడంతో వాటిని మరమ్మతులు చేయడానికి వచ్చిన సిబ్బంది ఎయిర్ లాక్ చేసి నీటిని వదిలేశారు. అలా వదిలేయడంతోనే నీరు కొద్ది సేపు ఎగిసిపడింది.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

గద్వాల అర్బన్: పంచాయతీ కార్మికులకు 9నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని పంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టరేట్ ఏఓ వీరభద్రప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హరీష్, చంద్రాములు, రాఘవేంద్ర, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఎవరికీ పట్టని మొండిగోడలు



గువ్వలదిన్నెలో అసంపూర్తిగా బస్టాప్

కేటీదొడ్డి: ప్రభుత్వ భవన నిర్మాణాలు మొండి గోడలకే పరిమితమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి నిర్మాణల పాలిట శాపంగా మారింది. దీంతో భవనాలు వినియోగంలోకి రాక వృథాగా పడటంతో రూ.లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయి. ఇలా మండలంలోని అనేక గ్రామాలలో భవనాలు పూర్తి చేయకుండానే మధ్యలోనే వదిలివేయడంతో ఆ భవనాలు ఎందుకు పనికి రాకుండా ఉన్నాయి. పాఠశాలలకు నిర్మాణం చేపట్టిన అదనపు గదులు, అగన్‌వాడీ, బస్టాండ్ వంటివి ప్రభుత్వ నిధులతో నిర్మించి వదిలివేశారు. ఏళ్లు దాటుతున్న ఆ భవనాలు గ్రామాల్లో దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తుండటంపై ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గోడల వరకు నిర్మించి వదిలివేయగా, మరికొన్ని పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలివేశారు. గువ్వలదిన్నె బస్టాప్ గోడల వరకు కట్టి వదిలివేశారు. అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

గద్వాలకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఎర్రవల్లిచౌరస్తా: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చేపట్టిన పాదయాత్రకు ఉమ్మడి ఇటిక్యాల మండలానికి చెందిన పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాధమ్మ, వెంకటేష్, మహేష్, బజారి తదితరులు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీ కొట్టిన బైక్: ఒకరికి గాయాలు



గాయపడిన మురళీధర్‌రెడ్డి

ఉండవెల్లి: ముందు వెళ్తున్న కంటైనర్‌ను బైక్ ఢీకొనగా ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నారాయణపురం చెందిన మురళీధర్‌రెడ్డి బైక్‌పై కర్నూల్‌కు బయలుదేరాడు. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న కంటైనర్ అలంపూర్‌చౌరస్తాలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్దకు రాగానే, ముందు వెళ్తున్న కంటైనర్‌ను బైక్ వెళ్తున్న మురళీధర్‌రెడ్డి ఢీకొన్నాడు. ఈ క్రమంలో మురళీధర్‌రెడ్డికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కంటైనర్ అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు.

చోరీలు నివారించేందుకు తనిఖీలు



శాంతినగర్‌లో వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్

శాంతినగర్: వాహనాల తనిఖీ సమయంలో సరైన ధ్రువపత్రాలు చూపాలని ఎస్‌ఐ సంతోష్ అన్నారు. చోరీలు నివారించేందుకు శాంతినగర్ సెంటర్‌లో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ధ్రువపత్రాలు చూపి నంబర్ ప్లేట్ అమర్చిన తర్వాత వాహనాలు అప్పగిస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు. రోడ్డు నిబంధనల ప్రకారం వాహనాలకు, వాహనం నడిపే వారికి అన్ని ధ్రువపత్రాలు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కాన్షీరాం స్ఫూర్తితో ముందుకెళ్లాలి



నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: బహుజనులకు రాజ్యాధికారం కోసం తన వ్యక్తిగత జీవితం త్యాగం చేసిన కాన్షీరాం స్ఫూర్తితో ముందుకెళ్లాలని బహుజన రాజ్యసమితి జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అన్నారు. కాన్షిరాం జయంతి సందర్భంగా శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, హుస్సేన్, దానయ్య, ప్రేమ్‌కుమార్, గోపాల్ రావు, కృష్ణ, శివరాజు తదితరులు ఉన్నారు.

నివాస గృహాల మధ్య ముళ్లచెట్లు



కొత్త రాజోళిలో పెరిగిన ముళ్ల చెట్లు

రాజోళి: మండలంలోని కొత్త రాజోళిలో గల పునరావాస గృహాల మధ్య ముళ్ల చెట్లు గుంపులుగా పెరిగాయని, వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇళ్ల మధ్యలో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో విషసర్పాల భయం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వాటి మధ్యలోనే పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయని, చిన్న పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయందోళనకు గురవుతున్నామని తెలిపారు.

ఎక్కడికక్కడ నిలిచిన మురుగు



ఎస్సీకాలనీలో నిలిచిన మురుగు

మానవపాడు: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలోని డ్రెయినేజీల్లో మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిలవడంతో పందులు, దోమలకు నిలయంగా మారిందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

గద్వాల అర్బన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని న్యాయవాది వరలక్ష్మీదేవి అన్నారు. నేనేకా గోబల్, పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ వారి సంస్థ సహకారంతో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గిరిబాబు, వార్డెన్ పద్మావతి, శ్రీలత, వినయ్, ఆనంద్, అనుదీప్ ఉన్నారు.

విద్యార్థుల ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

శాంతినగర్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో వెలసిన కాశీవిశ్వేర స్వామి, ఆంజనేయస్వామివారి ఆలయాల్లో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. హాల్‌టికెట్లను స్వామివారి ముందుంచి పూజలు చేశారు. పరీక్షల్లో అందరం అత్యధిక మార్కులు సాధించాలని దేవతామూర్తులను కోరుకున్నట్లు విద్యార్థులు తెలిపారు.

కూలిన కల్వర్టు



మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు సమీపంలో నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే నెట్టెంపాడు కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు కూలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. మలుపుల వద్ద ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టుకు రక్షణ గోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం అవుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో చోరీ

ధరూరు: మండలంలోని మన్నాపురం యూపీఎస్ పాఠశాలలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్‌ను ఎత్తుకెళ్లారు. విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడకూడదని భావించి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఏడు ఫ్యాన్లను తరగతి గదులు, వరండాల్లో బిగించారు. అయితే గురువారం మధ్యరాత్రి గుర్తు తెలియని దుండగులు ఒక ఫ్యాన్ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి నివ్వెరపోయారు. ఇటీవలే పాఠశాలకు విలువైన పెద్దపాటి టీవీలను అమర్చామని, వాటితో పాటు ఇంకా చాలా విలువైన పరికరాలు ఉన్నాయని సంబందిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు వాచ్‌మన్‌ను నియమించాలని హెచ్‌ఎం యోగేందర్ కోరారు.

పీహెచ్‌సీకి ట్యాంక్ వితరణ

అలంపూర రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీకి శుక్రవారం లింగన్వాయి పాఠశాల హెచ్‌ఎం రాఘురామయ్య నీటి ట్యాంకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసూనరాణి, సీహెచ్‌ఓ లక్ష్మీకాంతం, ఎంఎల్‌హెచ్‌పీ శివకుమార్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నర్సరీ పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. నర్సరీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.